క్లుప్తంగా

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు


ప్లాస్టిక్ వస్తువులు సీజ్ చేసి తీసుకెళుతున్న మునిసిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల విక్రయాలపై అధికారులు దాడులు నిర్వహించారు. చర్చివీధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణాన్ని అధికారులు సీజ్ చేశారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం పెరగడం, అమ్మకాలు తారాస్థాయిలో ఉండడంపై 'సాక్షి' దినపత్రికలో సోమవారం 'కమ్మేస్తున్న ప్లాస్టిక్ భూతం' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై కమిషనర్ నరసింహ ప్రసాద్ స్పందిస్తూ నగరంలో ప్లాస్టిక్ విక్రయాలపై నిత్యం తనిఖీలు జరగాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తన సిబ్బందితో కలిసి రెండు రోజులుగా పలు దుకాణాలు తనిఖీ చేశారు. ఒక టన్నుకు పైగా ప్లాస్టిక్ కవర్లు సీజ్ చేసి, నిబంధనలు పాటించని వ్యాపారులకు రూ.25 వేల జరిమానా విధించారు.

ఏకైక జ్ఞానమార్గం భగవద్గీత


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఐరాల: భగవంతుడు అందించిన ఏకైక జ్ఞాన మార్గం భగవద్గీత అని త్రైతసిద్ధాంత, ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక, నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి పేర్కొన్నారు. మండలంలోని తెల్లగుండ్లపల్లె, ఇరువారంపల్లె, నాంపల్లె, తాళంబేడువారిపల్లె, చంద్రయ్యగారిపల్లె, పాలకల, కలికిరిపల్లె, గోవిందరెడ్డిపల్లె, వైఎస్ కాలనీ, ఐకే రెడ్డిపల్లె, కంచంవారిఇండ్లు, బసివిరెడ్డిఇండ్లు, వినాయకపురంలో ఆయన కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. భగవద్గీత ప్రతి ఒక్కరూ పఠించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, హేమంత్, రేఖ, సుమలత, రామయ్య, విమల, ధనంజయ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేందుకు విజ్ఞాన శిబిరాలు


భగవద్గీత పుస్తకాలను వితరణ చేస్తున్న కమిటీ

ఐరాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని స్థానిక గ్రంథాయాధికారి సుజా పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తక పఠనం, వేమన పద్యాలు విద్యార్థులతో కంటస్థం చేయించారు. త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవాసమితి బంగారుపాళెం కమిటీ సభ్యులు భగవద్గీత ప్రాముఖ్యత వివరిస్తూ, విద్యార్థులతో పఠనం చేయించారు. గ్రంథాలయానికి 28 భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం ద్వారా లభించే జ్ఞానం జీవితాంతం వారి వెంటే ఉండి వారి భావి జీవితాన్ని తేజోవంతం చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

27న పాలేటమ్మ గంగ జాతర

ఐరాల: మండల కేంద్రంలో పాలేటమ్మ గంగ జాతర ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బాలాజి తెలిపారు. ఆలయ ఆవరణలో మంగళవారం పాలేటమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలో 48వ గంగ జాతర ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. బాలాజి మాట్లాడుతూ మంగళవారం ఉదయం అమ్మవారి శిరస్సు ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు. 28వ తేదీ సాయంత్రం అమ్మవారి నిమజ్జనం కార్య క్రమంతో జాతర ముగుస్తుందని వివరించారు.

అలరించిన హరికథా గానం

తవణంపల్లె: మండలంలోని నారసింహనపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల గురడిలో మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా మంగళవారం భగవతార్ శివకుమారి హరికథా గానాలాపం అలరించింది. ఆలయంలో ద్రౌపదీ సమేత ధర్మరాజులు, భీముడు, అర్జునుడు, నకుల సహదేవుల విగ్రహాలకు అభిషేకం పూజలు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి భాగవతార్ శివకుమారి అద్భుతంగా కథను ఆలపించారు. 10వ తేదీ నుంచి రాత్రి నాటకం తెలుగులో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలిచే ప్రదర్శిస్తారని నిర్వాహకులు తెలిపారు.


హరికథను ఆలపిస్తున్న భాగవతార్ శివకుమారి

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వర్షం



చిత్తూరులో ఎండ తీవ్రతకు ప్రజల ఇబ్బందులు

చిత్తూరు నగరంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నగరంలో ఎండలు మండిపోయాయి. తీవ్ర ఉక్కపోత, వేడిమికి తట్టుకోలేక జనం అల్లాడిపోయారు. సరిగ్గా సాయంత్రానికి నగరాన్ని మబ్బులు కమ్మేశాయి. చల్ల గాలుల మధ్య చిరు జల్లులు పడ్డాయి. దీంతో నగర వాసులు కొత్త అనుభూతిని పొందుతున్నారు. గత వారంలో రెండు సార్లు పెనుగాలుల మధ్య వర్షం కురుస్తుండడంతో వృక్షాలు కూలిపోయి, విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఇలా నిమిషాల వ్యవధిలోనే భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొనడం గమనార్హం. - చిత్తూరు అర్బన్


చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద కరి మబ్బులు

ఆధునిక సేద్యం.. లాభదాయకం

గుడిపాల: ప్రస్తుతం ఉన్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సేద్యం చేస్తే అధిక ఆదాయం వస్తుందని వ్యవసాయశాఖ ఏడీఏ ఉమ, వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. వారు మంగళవారం మరకాలకుప్పం, 189కొత్తపల్లె పంచాయతీల్లోని రైతుసేవా కేంద్రాల్లో రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు ఆధునిక డిజిటల్ నైపుణ్యం కలిగించి సాంకేతిక వ్యవసాయ పరిజ్ఞానం, వ్యవసాయ యాప్‌లు, డిజిటల్ పేమెంట్స్, వాతావరణం, మార్కెట్ ధరల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతుల సెల్‌ఫోన్‌లో డిజిటల్ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లు యోగప్రియ, తులసీ రాంరెడ్డి, భువనేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను విక్రయిస్తున్న అధికారులు

మట్టి పరీక్షలపై అవగాహన అవసరం

గుడిపాల: రైతులందరూ మట్టి నమూనా సేకరణ, పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి మాధవి సూచించారు. మట్టినమూనా సేకరణ విధానంపై మంగళవారం మండల కేంద్రంలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా ప్రతి మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. మట్టి పరీక్షల ఆధారంగా రసాయనిక ఎరువులు వాడుకోవాలని, అధిక మోతాదులో వాడకూడదని తెలిపారు. 2025–26 ఏడాదికి గాను మండలానికి 935 శాంపిల్స్ టార్గెట్‌గా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ యోగప్రియ పాల్గొన్నారు.

ఆర్గానిక్ కూరగాయలు విక్రయం

తవణంపల్లె: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, ఆకుకూరలను సరసమైన ధరలకు విక్రయిస్తున్నట్లు డ్వామా ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం మంగళవారం దగ్గర ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలను విక్రయించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు వినియోగించడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన పంటలు పండించాలని సూచించారు. కలుషితమైన ఆహార పదార్థాలకు స్వస్తి పలికి ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ బాల, ఈసీ రమ్య, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సరిత పాల్గొన్నారు.


మట్టి నమూనా సేకరిస్తున్న అధికారులు

సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు మంగళవారం ఆర్డీవో శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. ఆయన ఆర్డీఓతో మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గత 9 రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్షలు చేస్తుంటే కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీహెచ్‌ఓలకు ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని వెంటనే మినహాయించాలన్నారు. ఆరేళ్ల సర్వీస్ పూర్తయిన వెంటనే సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని చెప్పారు. క్లినిక్‌లకు అద్దెలు చెల్లించాలని తెలిపారు. 23 శాతం వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పునరుద్ధరించి ఇంక్రిమెంట్ సౌకర్యం కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ గౌరవ సలహాదారులు మణి, నాయకులు బాలాజీరావు, కుమారి, సురేష్, దేవి తదితరులు పాల్గొన్నారు.

స్వీయ ధ్రువీకరణలో మార్పులు చేయండి

చిత్తూరు అర్బన్: భవన నిర్మాణ అనుమతుల జారీ విషయంలో ప్రభుత్వం తీసుకొచ్చిన స్వీయ ధ్రువీకరణ కార్యక్రమంలో కొద్దిపాటు మార్పులు చేయాల్సి ఉందని చిత్తూరు అసోసియేషన్ జీపీ లైసెన్స్ డ్ ఇంజినీర్లు కోరారు. మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ నరసింహ ప్రసాద్, ఏసీపీ నాగేంద్రను కలిసి వినతిపత్రం అందచేశారు. యూనియన్ అధ్యక్షులు జయప్రకాష్ మాట్లాడుతూ భవన నిర్మాణ అనుమతులు పారదర్శకంగా జరగడానికి తీసుకొచ్చిన నిబంధనల్లో 300 చదరపు మీటర్ల లోపు స్థలాల్లో లైసెన్స్ డ్ సర్వేయర్‌ను తొలగించి, సచివాలయ కార్యదర్శులను నియమించాలన్నారు. ప్లాన్ పొందేప్పుడు న్యాయస్థానాల్లోని వివాదాలను దాచిపెట్టి అనుమతులు పొందితే సర్వేయర్ బాధ్యుడయ్యే అవకాశం ఉందన్నారు. దీన్ని వెంటనే తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుబ్రమణ్యం, శ్రీనివాస బాలాజీ, విజయశేఖర్, గుణ, సంతోష్, కేదరనాద్, రవి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న లైసెన్స్‌డ్ ఇంజినీర్లు

బాల్య సంరక్షణ ఆరోగ్య విద్యపై ప్రత్యేక దృష్టి

ఐరాల: బాల్య సంరక్షణ, ఆరోగ్య విద్యపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని, చిన్న పిల్లల అభివృద్ధి, భవిష్యత్తు కోసం ఆశా కార్యకర్తలు ప్రత్యేక దృష్టి వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆశాడే సందర్భంగా మంగళవారం ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సరైన పోషకాహారం, మంచి ఆరోగ్య, రక్షణ ద్వారా పిల్లల శారీరక పెరుగుదలకు సహాయపడుతుందన్నారు. పిల్లల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఆశాకార్యకర్తల పాత్ర కీలకమని సూచించారు. ఈ– ఆశా యాప్‌లో ఆరోగ్య సర్వే రికార్డులను విధిగా పర్యవేక్షించాలని తెలిపారు. ఆశావర్కర్ల పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ద్రావణం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తల్లీబిడ్డ రిజిస్ట్రేషన్ నమోదు శాతం పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్‌సీడీసీడీ స్క్రీనింగ్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పూర్ణలత, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్ఎన్ జీవకళ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న లోకేష్

చిత్తూరు అర్బన్: పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా కూడా నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. ఇప్పటికే రియల్ టైమ్ గవర్నెన్స్‌లో కార్పొరేషన్ వాహనాల పనితీరును నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్‌తో కలిసి అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వీధుల్లో చెత్త తీసే వాహనాలు ఏయే సమయాల్లో ఎక్కడ ఉంటాయనే వివరాలను ఆయా తెలియచేయడానికి ఆయా వార్డుల్లో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. జియో ట్యాగింగ్, జీపీఎస్ ద్వారా వాహనాలను నిత్యం మొబైల్‌లోనే పర్యవేక్షిస్తామని, అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంగా పనిచేయాలని సూచించారు. మరోవైపు నగరంలో ఈ నెల 13, 14 తేదీల్లో నిర్వహించనున్న గంగజాతర నేపథ్యంలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య పనుల ఏర్పాట్లను ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ పరిశీలించారు. బజారువీధిలో వ్యర్థాలు తొలగించడం, భక్తులకు ఇబ్బందులు కలగకుండా చేయాల్సిన పనులపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

అందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలి


తవణంపల్లె: చెర్లోపల్లెలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు


ఐరాల: గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: ప్రతి ఒక్కరూ ఆరోగ్య వంతులుగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని చెర్లోపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రోగులను పరీక్షించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించి ఆరోగ్యంగా ఉండాలని పేర్కొన్నారు. పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని సూచించారు. జ్వరం సోకిన వెంటనే డాక్టర్లను సంప్రదించి వైద్యం చేయించుకోవాలని వివరించారు. అనంతరం గర్భవతులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కె.పట్నంలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని కె.పట్నంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్యసేవలు అందించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం

ఐరాల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని గుండ్లపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఎండల తీవ్రత అధికమవుతున్న తరుణంలో చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. పండ్ల రసాలు, తీసుకోవాలని చెప్పారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం




గుడిపాల: అన్నదానం చేస్తున్న నిర్వాహకులు, గెరిగతోపాటు అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు, బంగారుపాళెం: నడివీధిలో కొలువైన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఆర్ఆర్ నగర్‌లో మంగళవారం గంగమ్మ జాతర ప్రారంభమైంది. తెల్లవారు జామున అమ్మవారిని నడివీధిలో కొలువుదీర్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను సమర్పించారు. బుధవారం సాయంత్రం అమ్మవారిని జలప్రవేశం ఉంటుందన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలో మంగళవారం దుర్గాలమ్మ గంగజాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం అంబళ్లను పోశారు. అమ్మవారితో పాటు గెరిగను గ్రామ వీధుల్లో ఊరేగించారు. మహిళలు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు, హోమంలో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: కాలజ్ఞాన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని తగ్గువారిపల్లెలో మంగళవారం శ్రీగోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అర్చకులు ఆలయ ఆవరణలో గణపతి పూజ, కలశపూజ, పుణ్యాహ వాచనం, హోమ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబ, స్వామి వారి శిష్యుడు సిద్దయ్య మూలవర్లకు మహా అభిషేకాన్ని చేపట్టారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో స్వామివారి తత్వకీర్తనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంతో ఉజ్వల భవిత


వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

గుడిపాల: కిశోరి వికాసం కార్యక్రమం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది వేస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ స్వర్ణలతాదేవి, చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ అధికారి శివశంకర్ అన్నారు. చీలాపల్లె, పేయనపల్లె, వసంతాపురం, పశుమంద అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కిశోరి బాలికలు సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాలికలను అసభ్య పదజాలంతో దూషించినా, ఫోన్లో మాట్లాడిన తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని, క్షణికావేశాలకు గురై ఆత్మహత్యలకు పాల్పడవద్దని స్పష్టం చేశారు. బాలికలందరికీ రక్తహీనత, రుతుక్రమ పరిశుభ్రత నిర్వహణ, లైంగిక దాడులు, లింగ అసమానతలు, బాల్య వివాహాలపై వారికి విపులంగా వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ భారతి, కార్యదర్శి సుందరేష్, వెంకటరమణ, అంగన్‌వాడీలు సోని, మణిమేఖల, మంజుల, మహిళా పోలీస్ పావని పాల్గొన్నారు.

శుభ్రత పాటించాలి

తవణంపల్లె: కిశోర బాలికలు రుతుక్రమంలో శుభ్రత పాటించాలని ఐరాల సీడీపీఓ నిర్మల తెలిపారు. మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోర వికాసం–వేసవి సెలవులు కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో ఉన్న బాలికల కోసం కీలక సందేశం అందించారు. కిశోర బాలికలు రుతుక్రమం, పరిశుభ్రత నిర్వహణ, లైంగిక విద్య గురించి అవగాహన కల్పించారు. కౌమార బాలికల నాయకత్వం, శారీరక వ్యాయామం, క్రీడల గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ నిర్మల